క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులతో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, నాగరాజుల కుమారుడు సుదర్శన్, దీపికల వివాహం శుక్రవారం స్థానిక అంతర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రామాదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయన సతీమణి పాతకోట కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డితోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

బద్రిపల్లెలో దంత వైద్య శిబిరం

చాపాడు : బద్రిపల్లె గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గుత్తి మల్లేశ్వరి ప్రారంభించారు. కడప రిమ్స్ దంత వైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దంతాల సంరక్షణ కోసం జాగ్రత్తలు పాటించాలన్నారు. క్రమం తప్పకుండా దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. దంత సమస్యలు ఉన్నప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నారాయణ యాదవ్, వైద్యులు సాయి స్రవంతి, రూప, జాసింత్, జ్యోస్న, నవీన, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకలో మాజీ ఎమ్మెల్యే



దువ్వూరు : చింతకుంట గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ టీయూ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కోగటం వీరారెడ్డి బావమరిది లోమడ రాఘవరెడ్డి కుమార్తె లోమడ విష్ణు ప్రియ, కోగటం వీరప్రతాప్‌రెడ్డిల నిశ్చితార్థం శుక్రవారం మైదుకూరులోని కేఎస్‌సీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైదుకూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోపిరెడ్డి బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

పరామర్శ


వెంకటరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి పంచాయతీ పరిధిలోని బోడుగుండుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బోడుకుండు వెంకటరెడ్డి (65) గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి శుక్రవారం ఆయన స్వగృహానికి చేరుకుని వెంకటరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఓ.ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు శిక్షణ

మైదుకూరు : మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం పండ్లు,కూరగాయల విలువ ఆధారిత ఉత్పత్తులపై స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళా రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ పండ్లు, కూరగాయల విలువ ఆధారిత ఉత్పత్తులు, వాటి ప్రాముఖ్యత, మార్కెటింగ్ సదుపాయాలు, యాంత్రికరణపై తెలియజేశారు. గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కాంతిశ్రీ మాట్లాడుతూ ఉద్యాన ఉత్పత్తులైన మామిడి, టమాటా, మిరప, మునగ ఉత్పత్తుల తయారీ విధానం, నిల్వ, ప్యాకింగ్ గురించి వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్ ,పశు వైద్య విభాగం శాస్త్రవేత్త విజయ నిర్మల మహిళా రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

కాశినాయన : సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ మైథిలి తెలిపారు. శుక్రవారం నరసాపురం స్త్రీ శక్తి భవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సొంతంగా ఆదాయం వచ్చే విధంగా వనరులను ఏర్పాటు చేసుకుని పంచాయతీలను అభివృద్ధి చేయాలని సూచించారు.

కూతురు భారం కాదు.. బాధ్యత


వైద్యాధికారి హిమబిందుతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది


అబార్షన్‌లపై ఆడిట్ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత

ప్రొద్దుటూరు క్రైం : ఆడపిల్లలు భారం కాదని బాధ్యత అని డాక్టర్ నల్లబల్లి హిమబిందు తెలిపారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వైఎంఆర్ కాలనీలో సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఈ పీసీపీ ఎన్‌డీటీ యాక్ట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించుకోవడంతో పాటు వారిని బాగా చదివించాలన్నారు. కూతురంటే భారం కాదని, కుటుంబానికి దేవుడు ఇచ్చిన వరమని తెలిపారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి మాట్లాడుతూ లింగవివక్షతో గర్భస్రావానికి పాల్పడరాదన్నారు. చట్టాన్ని అతిక్రమించి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చేసినవారితో పాటు చేయించుకున్న వారు కూడా శిక్షార్హులు అవుతారని తెలిపారు. అనంతరం వైఎంఆర్ కాలనీలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సెక్రటరి చెన్నమ్మ, సభ్యులు రమణమ్మ, అల్లాబకాష్, చంద్ర ఓబుళరెడ్డి, గంగాభవాని పాల్గొన్నారు.

అబార్షన్‌లపై ప్రత్యేక నిఘా

ప్రొద్దుటూరు క్రైం : ప్రైవేట్ ఆస్పత్రులలో నిర్వహించే అబార్షన్‌లపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత తెలిపారు. ప్రొద్దుటూరులోని పీపీ యూనిట్‌లో జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అబార్షన్‌లపై శుక్రవారం ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అవసరం లేకున్నా అబార్షన్‌లు చేయించుకుంటున్నారని తెలిపారు. మొదటి, రెండవ కాన్పులో ఆడపిల్లలకు జన్మనిచ్చిన వారు అబార్షన్‌లు చేయించుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటిపై పూర్తిగా ఆడిట్ నిర్వహించి ఎక్కడ అబార్షన్ చేయించుకుంటున్నారో విచారించి సంబంధిత ప్రైవేట్ ఆస్పత్రులపై చట్టపరమై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడపిల్లైనా, మగపిల్లాడైనా ఒకటే అని, గర్భస్రావం తల్లి ప్రాణానికి హానికరమని చెప్పారు. తల్లి ఒక సారి అబార్షన్ చేయించుకోవడం వల్ల మళ్లీ గర్భం దాల్చే అవకాశాలు తగ్గిపోతాయన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ సువిధ, డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామమూర్తినాయుడు

బద్వేలు అర్బన్ : పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామమూర్తినాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బద్వేలు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018 నుండి డీఆర్, 11వ పీఆర్సీ అరియర్స్, పీఆర్సీ తర్వాత రావాల్సిన నాలుగు డీఏ అరియర్స్‌ను మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, వీటి సాధన కోసం ఇప్పటికే ధర్నాలు, నిరసనలు చేపట్టినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. పెన్షనర్లు అందరూ ఐకమత్యంతో సమస్యలు సాధించేందుకు సహకరించాలన్నారు. సమావేశంలో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు హనుమంతరావు, జిల్లా కోశాధికారి నాగేష్, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, బద్వేలు పట్టణ ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్య, కోశాధికారి గంగన్న, పోరుమామిళ్ల సంఘ అధ్యక్షులు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై చర్యలు తీసుకోండి

మైదుకూరు : ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై వైద్యశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బా నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మైదుకూరులో విలేకరులతో మాట్లాడుతూ అర్హత లేకపోయినా క్లినిక్‌లను ఏర్పాటు చేసి ఆర్‌ఎంపీలు ఇంజక్షన్లు, సెలైన్లతో వైద్యం అందిస్తున్నారని ఆరోపించారు. నోటీసులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకోకుండా సమగ్ర పరిశీలన చేసి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

శివపురంలో పీఆర్‌ఏ కార్యక్రమం

మైదుకూరు : మండలంలోని శివపురంలో శుక్రవారం గ్రామీణ అవగాహన పని అనుభవంలో భాగంగాపార్టీ సపరేటెడ్ రూరల్ అప్రైజర్ (పీఆర్‌ఏ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊటుకూరు డాట్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ కృష్ణ ప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్‌వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సామాజిక మ్యాప్‌ను, వెన్ రేఖ చిత్రాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం పంటల సాగు గురించి విద్యార్థులు రైతులతో మాట్లాడారు.

కంటి పరీక్షలు

బి.కోడూరు : బి.కోడూరు పీహెచ్‌సీ పరిధిలోని లోయర్ సగిలేరు ప్రాజెక్టు వద్ద గల డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం ఆప్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 207 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ జాన్ విలియం, ఎంఎల్‌హెచ్‌పీ రాజేశ్వరి, ఏఎన్‌ఎం కుమారి, ప్రిన్సిపల్ చెన్నయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బోదకొట్టం దగ్ధం

మైదుకూరు : మండలంలోని గంజికుంట ఎస్సీ కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో భీంగాళ్ల చెంద్రాయుడు అనే వ్యక్తికి చెందిన బోదకొట్టం దగ్ధమైంది. ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు లేచాయని బాధితుడు తెలిపారు. భయంతో చెంద్రాయుడు అతని భార్య చిన్నక్క కేకలు వేస్తూ బయటకు పరిగెత్తారు. అగ్ని ప్రమాదం సమాచారాన్ని అందుకున్న మైదుకూరు అగ్నిమాపక కేంద్రం అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్

పోరుమామిళ్ల : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫోల్డ్ స్కోప్‌పై వర్క్ షాపు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ డేవిడ్ రాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన జంతుశాస్త్ర అధ్యాపకులు ప్రదీప్ ముఖ్య అతిథిగా పాల్గొని ఫోల్డ్ స్కోప్ గురించి వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి వారిని వినూత్న పరిశోధనల వైపుగా తీసుకెళ్లడం, విద్యవలన పేటెంట్ హక్కులను పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బాగాంధీ జూనియర్ కళాశాల, క్రిష్ణ శారద కళాశాలలు, వైష్ణవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకులు సవిత, శ్రీనివాసులుతో పాటు వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ టాన్స్‌ఫార్మర్లు తొలగించరా..?

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ పరిధిలో సగిలేరు ఒడ్డున అక్రమంగా ఏర్పాటు చేసుకున్న 40 ట్రాన్స్‌ఫార్మర్లు ఎందుకు తొలగించడం లేదని చాపాటి లక్ష్మినారాయణరెడ్డి పోరుమామిళ్ల విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నించారు. ఈ విషయమై శుక్రవారం ఏడీకి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు చెపితే వైఎస్సార్‌సీపీ నాయకులకు నోటీసులు ఇస్తున్నారని, నాకు సర్వేనెంబర్ 1193లో ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా 1194లో ఉన్నట్లు, దాన్ని తొలగించాలని నోటీసు ఇవ్వడం ఎంతవరకు సబబని లక్ష్మి నారాయణరెడ్డి ప్రశ్నించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కొత్తగా ఏర్పాటు చేయలేదని, ఎన్నో సంవత్సరాలుగా ఉందన్నారు. అధికారికంగా సర్వీసు తీసుకున్నానని అయితే అధికారులకు అది అక్రమంగా కనిపించడం టీడీపీ నాయకుల కుట్ర అన్నారు.

వ్యాధులతో జాగ్రత్త

గోపవరం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి సి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గోపవరం, శ్రీనివాసపురం గ్రామాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజలకు, విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం


వెంకటరెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కలసపాడు : గ్రామ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న ఉపాధ్యాయులు సి.వెంకటరెడ్డి, కె.వెంకటసుబ్బారెడ్డిల సేవలు అభినందనీయమని ఎంఈఓ ఎస్.మస్తాన్‌వలి, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాజుపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీలలో బదిలీ అయిన సి.వెంకటరెడ్డి, కె.వెంకటసుబ్బారెడ్డిల సన్మాన కార్యక్రమం శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు కె.రంగనాయకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మస్తాన్‌వలి, రమణారెడ్డి మాట్లాడుతూ మంచి వ్యక్తిత్వం, వృత్తి పట్ల నిబద్ధత కలిగి మంచి ఉపాధ్యాయులుగా వెంకటరెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలు పేరొందారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ కరీముల్లా, గ్రామ పెద్దలు పోకలరామకృష్ణారెడ్డి, పోకలసుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, రమణయ్య, రవి, ప్రతాపరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ప్రణాళిక ప్రకారం కృషి చేయాలి


బహుమతులు అందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేయాలని జేఎన్‌టీయూ పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్ తెలిపారు. మండలంలోని సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం టెక్నో హోలిక్స్ 2కే25 (నేషనల్ లెవెల్ సింపోసియం) నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఈవెంట్లలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, కళాశాల వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థిని హింసించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి


దేవసాని ఆదిత్య రెడ్డి

అట్లూరు : బ్రహ్మంగారిమఠం మండలంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థిని హింసించిన ఉపాధ్యాయుడిని వెంటనే సస్పెండ్ చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పోరుమామిళ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠం మండలంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడు నారాయణ స్వామి ఎలక్ట్రిక్ వైర్‌తో 7వ తరగతి విద్యార్థి సుశాంత్‌ను రక్తం వచ్చేలా కొట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదని తెలిపారు. కానీ కొందరు ఉపాధ్యాయులు ఇలాంటి క్రూర చర్యలకు పాల్పడి విద్యా వ్యవస్థపై మచ్చ తెస్తున్నారన్నారు. తక్షణమే విచారణ జరిపి ఉపాధ్యాయుడు నారాయణ స్వామిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీసీ కెమెరాలు, కౌన్సిలింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటువంటి చర్యలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామ పంచాయతీల్లోనే సంపద సృష్టించుకోవాలి


ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం : గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం పంచాయతీల్లోనే సంపద సృష్టించుకోవ ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీర్ అసిస్టెంట్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఎంపీడీఓ పలు సూచనలను చేశారు. గ్రామ పంచాయతీలు తమ ఆదాయ మూలాలను కనుగొని సమకూర్చుకున్నప్పుడే పంచాయతీ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ వెంకటసుబ్బయ్య, టీఓటీ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై శిక్షణ

పోరుమామిళ్ల : పంచాయతీలు స్వంతంగా ఆదాయ వనరులు పెంచుకోవాలని, తద్వారా ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించే అవకాశం లభిస్తుందని మండల అభివృద్ధి అధికారి ఉపేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సభాభవనంలో సర్పంచులకు, కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ట్రైనర్స్ హరికృష్ణ, ఓబులేసులు పంచాయతీలో ఆదాయ వనరులు ఏమిటి? ఎలా ఆదాయం సమకూర్చుకోవాలి? దాన్ని ఎలా వినియోగించుకోవాలి? అన్న అంశాలపై అవగాహన కల్పించారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

రాజుపాళెం : మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఆదాయ వనరులను పెంపొందించడంపై సర్పంచ్‌లు, గ్రామస్థాయి అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం రాజుపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరుల పెంపుదల కోసం తీసుకోవాల్సిన విధివిధానాలపై గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమాలను రెండు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వాలు ఇచ్చే నిధులే కాకుండా ఆస్తి పన్ను, సేవా రుసుం, లైసెన్స్ ఫీజు, ఇతర ఆదాయ వనరులపై దృష్టి సారించాలన్నారు. గ్రామ పంచాయతీ ఆదాయ వనరులకు ఒక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ షాకీర్ అలీఖాన్, సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ వనరులను గుర్తించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ వీరకిశోర్

చాపాడు : గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా అందుబాటులో ఉన్న వనరులను గుర్తించాలని మండల అభివృద్ధి అధికారి వీరకిశోర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆదాయ వనరుల గుర్తింపుపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం స్వతహాగా ఆదాయ వనరులను గుర్తించుకోవాలన్నారు. ప్రస్తుతం ఇంటి పన్ను మాత్రమే ఆదాయంగా ఉందన్నారు. చెత్త నుండి సంపద సృష్టించుకోవాలన్నారు. వాటితోపాటు నూతన ఆలోచన విధానాల ద్వారా పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. అనంతరం ట్రైనర్ సుబ్బరాయుడు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ హరినాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహ్మద్, పీఆర్ ఏఈ చంద్రమౌళి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఖాజీపేటలో..

ఖాజీపేట : గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఆదాయంపై దృష్టి సారించాలని ఎంపీడీఓ దివిజా సంపతి అధికారులకు సూచించారు. శుక్రవారం ఖాజీపేటలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సభాభవన్‌లో మండల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా వచ్చే ఆదాయాలు కాకుండా పంచాయతీకి ఆదాయం వచ్చే మార్గలపై దృష్టి సారించాలన్నారు. అలా పంచాయతీకి ఆదాయ వనరులను పెంచుకోవడం ద్వారా పంచాయతీకి ఆర్థిక పరిపుష్టి వస్తుందని అన్నారు. దీని వల్ల పంచాయతీలో సొంత నిధులతో పనులు చేయవచ్చునని పేర్కొన్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి హేయమైన చర్య


ఖాజీపేట: తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


మైదుకూరు: వినతి పత్రాన్ని, అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


రాజుపాళెంలో వీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఖాజీపేట : సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేయడం హేయమైన చర్యగా ఎమ్మార్పీస్ సీనియర్ నాయకుడు చాట్ల జయరాముడు అన్నారు. ఖాజీపేటలో చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడికి నిరసనగా ఎమ్మార్పీస్ నాయకుల ఆధ్వర్యంలో ఖాజీపేట బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వారు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి విచారణ జరిపి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మరొకసారి ఎవరూ ఇలాంటి చర్యకు పాల్పడకుండా ఉండేందుకు కఠినంగా వ్యవహరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు కిరణ్ కుమార్, గంగరాజు, రాముడు, గంగయ్యతోపాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు : సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడి రాజ్యాంగంపై జరిగిన దాడేనని ఎమ్మార్పీఎస్, బేడ బుడగ జంగం నాయకులు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా దళితుడైన గవాయి ఉండటం కొన్ని శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయని ఈ సందర్భంగా వారు ఆరోపించారు. న్యాయమూర్తిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, దాడి వెనుక ఉన్న వారిని గుర్తించాలని వారు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మార్పీఎస్, బేడ బుడగ జంగం ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేష్, బేడ బుడగ జంగం నాయకుడు కొండయ్య, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్ నాయకులు ఓబన్న, శ్రీనివాసులు, జయరాం, కొండయ్య, ఓబన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిని శిక్షించాలి

రాజుపాళెం : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై షూ విసిరి దాడికి పాల్పడిన న్యాయవాదిని శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పల్లోలి పవన్ నరసింహులు అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం రాజుపాళెంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దాడి భారతీయులను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. దళితుడైన బీఆర్ గవాయి సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ కావడం కొన్ని ఆధిపత్య శక్తులు జీర్ణించుకోలేక పోతున్నాయని చెప్పారు. అనంతరం వీఆర్‌ఓ అశోక్‌కు వారు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి గంగులయ్య, ఉప అధ్యక్షుడు మారయ్య, ఎంఎస్‌పీ అధ్యక్షుడు చిన్నయ్య, వెంకట్, పామిలేటి, పరశురాం, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్లపై వెళ్లేదెలా..?


రెడ్డినగర్‌లో ఓ వీధి పరిస్థితి

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ గిరినగర్, రెడ్డినగర్‌లలో వీధుల్లో తిరగలేని పరిస్థితి నెలకొందని, పంచాయతీ అధికారులు, రెవిన్యూ అధికారులు స్పందించి వీధులు బాగు చేయాలని మానవ హక్కుల సంఘం చీఫ్ గంగన్న, కార్యదర్శి ఫణిరావు, సాగర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు ఆ వీధుల్లో పర్యటించారు. గిరినగర్ అంబేద్కర్ భవన్ పక్కవీధి, రెడ్డినగర్ 1, 2, 3, 4 వీధులు, ఆది ఆంధ్రపాలెం వెళ్లే రోడ్డు గంతలు పడి వాన నీళ్ళతో నడవటానికి అత్యంత దుర్భరంగా ఉందన్నారు. గత వారం రోజులుగా వాన పడుతుండటంతో బురద గుంటల్లో విద్యార్థులు నడవటానికి అవస్థలు పడుతున్నారన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వీధులు బాగు చేయకపోతే మళ్లీ కోర్టులో కేసులు పెడతామని వారు హెచ్చరించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం


సంతకాలు సేకరిస్తున్న మల్లెల రాజాంరెడ్డి, మల్లెల ఝాన్సీరాణి

ప్రొద్దుటూరు : ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ మల్లెల రాజారాంరెడ్డి, అప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లె పంచాయతీ లింగాపురం గ్రామంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు, పేద విద్యార్థులకు వైద్య సేవలు, వైద్య విద్యను దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్ యాదవ్, లింగాపురం సొసైటీ మాజీ చైర్మన్ తుపాకుల ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అరకటవేముల హరినారాయణ

ప్రొద్దుటూరు : నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరకటవేముల హరినారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలలో 21 కంపెనీలో పాల్గొనగా జిల్లా వ్యాప్తంగా 525 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్ మేళాలో 114 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పృథ్వీనారాయణ, కళాశాల కోఆర్డినేటర్ పర్లపాడు గౌరీశంకర్ పాల్గొన్నారు.

జక్కా జ్యోతి ఫుడ్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు, శంకరయ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : జక్కా జ్యోతి ఫుడ్స్ వ్యాపారం చేస్తూ పెట్టుబడి పెడితే లాభం వస్తుందని నమ్మించి మోసం చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం బాధితులు హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ, చిలకలూరిపేటకు చెందిన శ్రీనివాసరావు, నందలూరుకు చెందిన శంకరయ్య మాట్లాడుతూ జక్కా పెద్దన్న జ్యోతి ఫుడ్స్ పేరుతో విస్తృత ప్రచారం చేశారన్నారు. తన సంస్థలో పెట్టుబడి పెడితే తమకు భాగస్వామ్యం కల్పిస్తామని చెప్పారన్నారు. ఆ మాటలు నమ్మి పెట్టుబడి పెడితే మొదట్లో కొంత వడ్డీ చెల్లించారని తెలిపారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన తర్వాత ఆయన పరారయ్యారని తెలిపారు.